
సాక్షి ఒడిశా

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 4,01,187

బంగారం 950 మిల్లీ గ్రాములు

వెండి 55 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సంస్కృతిని పరిరక్షించుకుందాం

గంజాం కళా, సంస్కృతులను పరిరక్షించుకుందామని హోటల్స్ సంఘం అధ్యక్షుడు ఉమాకాంత్ పాణిగ్రాహి అన్నారు.

- IIలో



మహనీయులను అనుసరిద్దాం

మహనీయుల అడుగుజాడల్లో నడుద్దామని వక్తలు పిలుపునిచ్చారు. జయపురంలో మహారాజా రాజశ్రీ విక్రమదేవ్ వర్మ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాంస్య విగ్రహాలను ఆవిష్కరించారు.

- IIలో

న్యూస్‌రీల్

13,855 మందికి పింఛన్లు



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న అధికారులు

జయపురం : మధుబాబు పెన్షన్ యోజన, జాతీయ సామాజిక సుర్క్షా పథకంలో భాగంగా జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితిలో 13,855 మంది లబ్ధిదారులకు శుక్రవారం కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. బొరిగుమ్మ, బొడిగాం, బి.సింగపూర్, జుజారి, హొరదలి, కమత, కుమిలి, కాశరగడ, రనస్‌పూర్, సెమలిగుడ, కొణాగాం, మలద, సనపొరియ, డెంగాపొదర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో బొరిగుమ్మ సమితి అధ్యక్షుడు దీప్తిమయి నాయిక్, బీడీఓ విక్రమకుమార్ దొర, సమితి సామాజిక సుర్క్షా అధికారి చంద్రిక కందకెల, నరేంద్ర బిశాయి, బీజేడీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ చంద్ర బిడిక తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



ప్రారంభ గీతం ఆలపిస్తున్న విద్యార్థులు

బరంపురం : హరడఖండిలోని బినాయక్ ఆచార్య కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రమిళ ఖడంగ జ్యోతి వెలిగించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు శంకర్, గోవింద్, మధుమిత నాయక్, కమలకాంత్, కలిపడా ముండా తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

జయపురం : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమ్మెపై ఎస్మా ప్రకటించినా ఒడిశా అగ్నిమాపక సిబ్బంది నిరసన కొనసాగిస్తున్నారు. జయపురం అగ్నిమాపక కార్యాలయం ఎదుట అగ్నిమాపక డ్రైవర్లు, హవల్దార్లు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. గతంలో పోలీసులతో సమానంగా వేతనం ఇచ్చేవారని, 2010లో మార్చేశారని, ఆ వ్యత్యాసాన్ని తొలగించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపడుతున్నా తమను గుర్తించకపోవడం తగదని అంటున్నారు. డిమాండ్లు సాధించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు. కాగా, శివరాత్రి నేపథ్యంలో ప్రసిద్ధ గుప్తేశ్వర్‌లో జరగనున్న యాత్రకు సంబంధించి అధికార యంత్రాంగం శనివారం నిర్వహించిన మాక్‌డ్రిల్‌కు కూడా జయపురం అగ్నిమాపక సిబ్బంది హాజరుకాలేదు.

కేంద్రాస్పత్రికి రోగుల తాకిడి



చికిత్స చేస్తున్న వైద్యులు

జయపురం: జిల్లాలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అన్నిచోట్లా జ్వరం, జలుబు, దగ్గు, కఫం తదితర లక్షణాలతో ప్రజలు బాధపడుతున్నారు. వీరంతా జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. సాధారణంగా ఇక్కడ ప్రతిరోజూ ఓపీ 800 వరకు ఉంటుంది. ఇప్పుడు ఓపీ గణనీయంగా పెరిగిందని, ఆస్పత్రికి వస్తున్న వారిలో పావుశాతం ఫ్లూ వ్యాధిగ్రస్తులని వైద్యులు చెబుతున్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, ఇష్టారాజ్యంగా మాత్రలు, మందులు వేసుకోకుండా వైద్యులు సూచనలు పాటించాలని శిశు వైద్య నిపుణుడు డాక్టర్ గౌతమ్ త్రిపాఠీ సూచించారు. మాస్కులు ధరించాలని సూచించారు.



- జంట నగరాల్లో తేలికపాటి జల్లులు
- ఉపశమనం పొందిన నగరవాసులు
- మిగిలిన ప్రాంతాల్లో పెరిగిన ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

చిరుజల్లులు..వడగాలులు

భువనేశ్వర్: రాష్ట్రంలో భిన్న వాతావరణం నెలకొంది. గత కొద్ది రోజులుగా వేడితో అల్లాడిపోయిన ప్రజలు శనివారం కురిసిన తేలికపాటి వర్షంతో కొంత ఉపశమనం పొందారు. కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదుకావడంతో ఉదయం వాతావరణం చల్లబడింది. భద్రక్, కేంద్రాపడా, కటక్, నయాగడ్, ఖుర్దా, పూరీ, అంగుల్, కెంజొహర్, ఢెంకనాల్‌తో సహా పలు జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం కురిసింది. ఈ నెల 28 వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. చల్లని గాలులతో రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందని కేంద్రం పేర్కొంది. కెంజొహర్, బాలాసోర్, కొరాపుట్, రాయగడ జిల్లాల్లోని కొన్ని చోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. దీని ప్రభావంతో ఆదివారం నుంచి వర్షం తీవ్రత కాస్త పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సమాచారం.

ఉత్తర కోస్తా ఒడిశా, దేవ్‌గఢ్, సుందర్‌గఢ్ , బౌధ్, కలహండి, దక్షిణ కోస్తా ఒడిశా, రాయగడ, ఖుర్దా, కొరాపుట్, మల్కన్‌గిరిలో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, మయూర్‌భంజ్, కెంజొహర్ అంగుల్, ఢెంకనాల్, పూరీ, ఖుర్దా, నయాగడ్, బౌధ్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన వర్షం వాతావరణ సూచనతో ఐఎండీ పసుపు హెచ్చరిక జారీ చేసింది.

వడగాలుల నేపథ్యంలో మార్గదర్శకాలు..

రాష్ట్రంలో కొన్ని రోజులుగా వివిధ ప్రాంతాల్లో పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. వడగాడ్పుల తీవ్రత దృష్ట్యా అవాంఛనీయ అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని ప్రజారోగ్య శాఖ ముందస్తు జాగ్రత్తలను సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా వైద్యాధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రధాన జిల్లా వైద్య (సీడీఎం), ప్రజారోగ్య అధికారులు (పీహెచ్‌వో) వడగాడ్పుల ప్రభావిత పరిస్థితుల నిర్వహణ, నియంత్రణ, నివారణ నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రజారోగ్య శాఖ డైరెక్టరేట్ ఆదేశించింది. ప్రజారోగ్య శాఖ స్థానిక క్యాపిటల్ హాస్పిటల్, రౌర్కెలా ఆర్‌జీహెచ్ డైరెక్టర్లకు లేఖలు జారీ చేసింది. వీరితో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్య కళాశాల ఆసుపత్రులు, మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ ఆస్పత్రులు, అన్ని ముఖ్య జిల్లా వైద్య, ప్రజారోగ్య అధికారులు, ఆరోగ్య అధికారులకు లేఖలు విడుదల చేసింది. వీరంతా సమగ్ర కార్యాచరణ రూపొందించి మార్చి 1లోగా ప్రజారోగ్య శాఖ డైరెక్టరేట్‌కు సమర్పించాలని లేఖలో పేర్కొంది.

జూన్ వరకు వడగాలులే..

సాధారణంగా రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు వడగాడ్పుల ప్రభావం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఫిబ్రవరి చివరి వారంలో ఉష్ణోగ్రతలు పెరగడం ప్రారంభించాయి. వడగాలుల మార్పుల వల్ల వడదెబ్బ వంటి ఇబ్బందులు ఏర్పడవచ్చని ప్రజారోగ్య శాఖ అనుబంధ అధికారులకు సూచించింది.

రాష్ట్రంలో 34 కొత్త ఎన్‌ఏసీలు

భువనేశ్వర్: రాష్ట్రంలో 20 జిల్లాల్లో 34 కొత్త నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్‌ఏసీ) ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ప్రకటించారు. వీటితో నాలుగు జిల్లాల్లో 5 ఎన్‌ఏసీలకు మున్సిపాలిటీలుగా ఎదుగుదల కల్పించినట్లు వెల్లడించారు. మున్సిపాలిటీలుగా ఎదుగుదల పొందనున్న 5 ఎన్‌ఏసీల్లో బౌధ్ జిల్లా బౌద్‌గఢ్, మయూర్‌భంజ్ జిల్లా కరంజియా, బొలంగీర్ జిల్లా కంటాబంజి, గంజాం జిలాల్లో ఛత్రపురం, అస్కా ఉన్నాయి. 5టీ, నవీన్ ఒడిశా చైర్మన్ వి.కార్తికేయ పాండియన్ జిల్లా పర్యటనల్లో వెలుగు చూసిన ప్రాంతీయుల దీర్ఘకాల డిమాండ్లతో ప్రాంతీయ అభివృద్ధి దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా 34 నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్‌ఏసీ) ఏర్పాటు కానున్నాయి. ఈ జాబితాలో అంగుల్ జిల్లాలోని పాల్లొలొహడా, ఛెండీపాదా, బాలాసోర్ జిల్లా బొస్తా, సిములియా, బర్‌గడ్ జిల్లా పాయికమల్, ఛెడెన్, భద్రక్ జిల్లా ఒగొరొపాడా, బొలంగీర్ జిల్లా బెల్పొపాడా, సింతొలొ, జాజ్‌పూర్ జిల్లా బింఝూర్‌పూర్, పాణీకొయిలి, జరక, చండీఖోల్, కలహండి జిల్లా జయపట్న, కంధమల్ జిల్లా రయికియా, కొరాపుట్ జిల్లా బొరిగుమా, నువాపడా జిల్లా సినాపాలి, రాయగడ జిల్లా చందిలి, మునిగుడ, బిసమ్‌కటక్, సువర్ణపూర్ జిల్లా డుంగురిపల్లి, సుందర్‌గడ్ జిల్లా బొణై, గంజాం జిల్లా సెరొగొడొ, కుకుడాఖండి, నయాగడ్ జిల్లా కొంటిలో, ఖుర్దా జిలా టంగి, బెగునియా, కటక్ జిల్లా సలేపూర్, బొడొంబా, నరసింగ్‌పూర్, నియాలీ, మయూర్‌భంజ్ జిల్లా బెటోనటి, ఢెంకనాల్ జిల్లా పర్‌జంగ్, బౌద్ జిల్లా కొంటామల్ ఎన్‌ఏసీ హోదా పొందాయి. సామాజిక, ఆర్థిక పురోగతి ప్రామాణికంగా కొత్త ఎన్‌ఏసీలు, మునిసిపాలిటీల ఏర్పాటు నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పోస్టర్లు, బ్యానర్లు తొలగించండి

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్థానిక నగర పాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం నగర వ్యాప్తంగా పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) రాజకీయ పార్టీలను కోరింది. ఎన్నికల సంఘం (ఈసీ) మార్గదర్శకాల ఆధారంగా గోడలపై రాతలు, పోస్టర్లు, బ్యానర్లు, నినాదాలను తొలగిస్తామని కమిషనర్ విజయ్ అమృత కులంగే తెలిపారు. ఈ మేరకు కార్యాచరణ ప్రారంభమైందన్నారు. రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌డీసీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

బరంపురం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగన్నాథ్‌ప్రసాద్ బ్లాక్ ప్రజలు శుక్రవారం ఆర్‌డీసీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దక్షిణాచల్ రెవెన్యూ కార్యాలయం వద్ద మానవ అధికారి సుర్క్ష మంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది భగవాన్ సాహు మాట్లాడుతూ బ్లాక్ పరిధిలో వివిధ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద పలు ప్రతిపాదనలు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. పది రోజుల్లో పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డీసీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అబని కుమార్ గయా తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో బ్లాక్ డే



నిరసన వ్యక్తం చేస్తున్న కమ్యూనిస్టులు

జయపురం: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనసరిస్తున్న రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా భారతీయ కమ్యూనిస్టు పార్టీ కొరాపుట్ జిల్లా శాఖ ప్రతినిధులు శుక్రవారం జయపురంలో నిరసన వ్యక్తం చేస్తూ బ్లాక్ డే పాటించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్‌కుమార్ మహంతి నేతృత్వంలో పార్టీ శ్రేణులు అరుణ పతాకాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రభుత్వ, రైతు, కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా నినాదాలు చేశారు. డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తున్న హర్యానా, పంజాబ్ రైతులను అణచివేయడం దారుణమన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసుల కాల్పులు జరపడంతో 22 ఏళ్ల శుభకరణ సింగ్ మరణించం విచారకరమన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి జుధిష్టర్ రౌళో, సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, సత్యబ్రత నందొ, నంద కుమార్, నిత్యానంద పాత్రో, దభచరణ్ బారిక్ తదితరులు పాల్గొన్నారు.

● గజోద్ధరణ అలంకారంలో జగన్నాథుడు



గజోద్ధరణ అలంకరణలో దేవతా మూర్తులు

మాఘ పౌర్ణమి సందర్భంగా పూరీ జగన్నాథ ఆలయంలో శ్రీ మందిరం రత్న వేదికపై బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుడు శనివారం గజోద్ధరణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథుని ఒడిలో మహా లక్ష్మి ఆసీనమై దర్శనం ఇవ్వడం ఈ అలంకరణ ప్రత్యేకత. సంప్రదాయం ప్రకారం మాఘ పౌర్ణమి నాడు మూల విరాట్టులకు గజోద్ధరణ రూపంలో అలంకరిస్తారు. మొసలి కోరల్లో చిక్కుకున్న గజేంద్రున్ని మహా విష్ణువు రక్షించడం ఈ కథనం ఇతివృత్తం.

– భువనేశ్వర్

ఘనంగా లక్ష్మీనారాయణ ఆలయ ప్రతిష్ఠాపన



కలశయాత్రలో మహిళలు



పూజా కార్యక్రమంలో నెక్కంటి, హిమరిక తదితరులు

రాయగడ : సదరు సమితి అమలాభట్ట సమీపంలోని శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఎకరా విస్తీర్ణంలో నిర్మించిన లక్ష్మీనారాయణ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త, మండలి అధ్యక్షుడు దూడల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ముందుగా జేకేపూర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయం వద్ద కలశ యాత్ర ప్రారంభమైంది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నాగావళి నది నుంచి కలశాలతో నదీ జలాలను తీసుకొచ్చి ఆలయ సంప్రోక్షణ చేశారు. వేద పండితులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్షేణ, భగవ పుణ్యాహవచనం, ప్రతిష్ఠా సంకల్పం, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 29 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, మాజీ మంత్రి లాల్ బిహారీ మిరిక, పి.వి.పి.రాము, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ్ సాగర్ అభివృద్ధికి ఒప్పందం



ఎం.ఓ.యూలు మార్చుకుంటున్న మున్సిపల్, హాల్ అధికారులు

జయపురం: పట్టణంలో చారిత్రాక జగన్నాథ్ సాగర్ అభివృద్ధికి శుక్రవారం జయపురం మునిసిపాలిటీ, సేనాబెడ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) మధ్య రెండవ ఎంఓయూలపై ఒప్పందం జరిగినట్లు జయపురం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు. సునాబెడ హాల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయ సభా గృహంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ దేవీప్రసాద్ డాలి, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీతల సమక్షంలో హాల్ అధికారులు సంతకాలు చేసినట్లు చెప్పారు. దీని ప్రకారం జగన్నాథ్ సాగర్ అభివృద్ధికి హాల్ మరో రూ.6 కోట్లు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. మొదటి విడతలో ఇప్పటికే రూ.కోటి అందజేసినట్లు గుర్తు చేశారు. తాజా ఒప్పందం ప్రకారం మూడు విడతలుగా రూ. 6 కోట్లు అందజేస్తారకని వెల్లడించారు. ఈ ఒప్పంద గడువు 2026 వరకు ఉంటుందన్నారు. ఈ నిధులతో గేటు, చిన్నారుల చిత్ర వినోదిని కేంద్రం, వృద్ధులు సేద తీర్చుకునేందుకు సౌకర్యాలు, ఓపెన్ థియేటర్, స్టేజ్ తదితర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

వ్యాపార బదిలీ ఒప్పందం అమలు చేయాలి



లేబర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు



డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రమోద్‌కుమార్ మహంతి

జయపురం: న్యూఢిల్లీలో 2020 ఫిబ్రవరి 26న భారత ప్రభుత్వ నోటరీ పబ్లిక్ సీల్ సంతకం చేసిన 57 పేజీల బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్‌ను అమలు చేయాలని జయపురం గగణాపూర్ సేవా పేపరు మిల్లు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జయపురం కార్మిక విభాగ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార బదిలీ ఒప్పందం అమలు చేస్తే తమ సమస్యలు పరిష్కారమయ్యేవని చెప్పారు. కార్మికుల గ్రాట్యుటీ సొమ్ము చెల్లించాలని కమిషనర్ ఆదేశించినా ఇంతవరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు ఆస్తులు అమ్మేసేందుకు టీపీడీఆర్ కేసును జిల్లా మెజిస్ట్రేట్ వద్ద దాఖలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం డిప్యూటీ లేబర్ కమిషనర్ నరేంద్ర రాయిక మాట్లాడుతూ నాలుగు సంఘాల ప్రతినిధులు, పేపరుమిల్లు యాజమాన్య ప్రతినిధులను పిలిచి సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక నేతలు ప్రమోద్‌కుమార్ మహంతి, జయంత శాంత్ర, సరోజ్ సువార్, ప్రదీప్ పంజియ, బనమాలి పాత్రో, కేదార్ ఆచార్య, అలేఖ్ పాత్రో పాల్గొన్నారు.

బీఎంసీ కొత్త కమిషనర్‌గా రాజేష్

- విజయ్ అమృత్ కులంగేకు బదిలీ
- ఇంకా పోస్టింగ్ ఇవ్వని సర్కారు
- కార్పొరేషన్ సమావేశ భత్యం పెంపు నిర్ణయమే కారణమని ప్రచారం



బాధ్యతలు స్వీకరించిన కొత్త కమిషనర్ రాజేష్ ప్రభాకర్ పాటిల్

భువనేశ్వర్: భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కమిషనర్ విజయ్ అమృత కులంగే ఆకస్మికంగా బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి రాజేష్ ప్రభాకర్ పాటిల్ నూతన కమిషనరుగా నియమితులయ్యారు. ఈయన 2005 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.

వివాదాస్పదమైన పెంపు ప్రకటన..

కమిషనర్ విజయ్ అమృత కులంగే ఆకస్మిక బదిలీ చర్చనీయాంశమైంది. ప్రభుత్వ అనుమతి, ఆమోదం లేకుండా నగర పాలక సంస్థ మేయరు, డిప్యూటీ మేయరు సమావేశ భత్యం పెంచినట్లు ఆయన ప్రకటించారు. ఒక్కో కార్పొరేషన్ సమావేశానికి మేయర్‌కు రూ.50వేలు, డిప్యూటీ మేయర్‌కు రూ.25వేలు, కార్పొరేటర్‌కు రూ.10 వేలు చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయం వివాదాస్పదమైనట్లు సమాచారం. బీఎంసీ సమావేశంలో ప్రతిపాదన ప్రభుత్వ ఆమోదం పొందకుండా కమిషనరు హోదాలో ప్రకటించడంతో ఆయన ఆకస్మిక బదిలీకి గురైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మేయర్, డిప్యూటీ మేయరు సమావేశ భత్యం పెంపుదల ప్రకటన ఉపసంహరించుకున్నట్లు భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ శనివారం ప్రకటించింది. బీఎంసీ కొత్త కమిషనర్‌గా నియమితులైన రాజేష్ ప్రభాకర్ పాటిల్ ప్రస్తుతం సహకార శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఈ హోదాలో గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ బాధ్యతలతో ఆయన భువనేశ్వర్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని తాజా ఉత్తర్వులు పేర్కొన్నాయి. 2013 సంవత్సరపు ఐఏఎస్ బ్యాచ్ అధికారి, బీఎంసీ మాజీ కమిషనర్ విజయ్ అమృత కులంగే ప్రస్తుతం నెల రోజులు సెలవు పెట్టారు. తిరిగి వచ్చిన తర్వాత తదుపరి పోస్టింగు ఇస్తారు.

క్లుప్తంగా

'బ్యాంక్ అప్రయిజర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి'



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్లు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకలలో పనిచేస్తున్న బ్యాంక్ అప్రయిజర్స్‌కు ఉద్యోగభద్రత కల్పించాలని ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్ యూనియన్ ప్రతినిధులు కె.మోహన్, కె.దుర్గాప్రసాద్, డి.అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీహాల్‌లో శనివారం ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్‌కు ఏవైనా సమస్యలు ఉంటే ఆ సమస్యలపై అన్ని బ్యాంకల అప్రయిజర్స్ సమష్టిగా పోరాటం చేయాలన్నారు. మార్చి 10న విజయవాడలో ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రయిజర్స్ ద్వితీయ మహాసభ జరగనుందని తెలిపారు. ఈ సభకు అందరు అప్రయిజర్స్ హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం చలో విజయవాడకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆల్ బ్యాంకు అప్రైజర్స్ యూనియన్ ప్రతినిధులు కె.మోహనరావు కె.దుర్గా ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, పి.మురళి, ఎం.రాంబాబు, ఏఐటీయూసీ నాయకుడు తిరుపతిరావు, అధిక సంఖ్యలో అప్రయిజర్స్ పాల్గొన్నారు.

కన్నయ్య కళ్లు సజీవం



నేత్రదానం చేసిన మృతుడు కన్నయ్య

టెక్కలి రూరల్: స్థానిక మెట్టవీధికి చెందిన చిలుకు కన్నయ్య(79) శనివారం మృతిచెందారు. మృతి విషయం తెలుసుకున్న టెక్కలి ప్రజా చైతన్య కళా సమితి నిర్వాహకులు మల్లారెడ్డి పద్మనాభం, దూసి ఆంధ్రాస్టాలిన్‌లు మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి ఒప్పించారు. అనంతరం శ్రీకాకుళం రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ సొసైటీ సిబ్బంది కె.పవన్, టి.సుజాతలు కన్నయ్య నేత్రాలను సేకరించారు. నేత్ర దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను స్థానికులు అభినందించారు.

అద్దె బస్సుల కోసం టెండర్ల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన 32 బస్సులను సరఫరా చేసేందుకు ఔత్సాహిక ఆపరేటర్ల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన ఆపరేటర్లు ఎంఎస్‌టీసీ ఈ-కామర్స్ పోర్టల్ www. mstcecommerce.com నందు రిజిస్టర్ చేసుకుని, ఈ నెల 21 తేదీ నుంచి మార్చి 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు టెండర్ల ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ మార్చినెల 14వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి అదే రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సూపర్ లగ్జరీ: శ్రీకాకుళం – విజయవాడ మార్గంలో 1 బస్సు, అల్ట్రా డీలక్స్: శ్రీకాకుళం – విశాఖ మార్గంలో 6 బస్సులు, పలాస – విశాఖ మార్గంలో 3 బస్సులు, ఎక్స్‌ప్రెస్: శ్రీకాకుళం – విజయనగరం మార్గంలో 4, శ్రీకాకుళం – పాలకొండ మార్గంలో 2, ఇచ్ఛాపురం – విశాఖపట్నం మార్గంలో 4 బస్సులు, అల్ట్రా పల్లె వెలుగు: శ్రీకాకుళం – విశాఖపట్నం మార్గంలో 2 బస్సులు, పల్లె వెలుగు: శ్రీకాకుళం – సాలూరు మార్గంలో 1, శ్రీకాకుళం – బత్తిలి మార్గంలో 5, టెక్కలి – పలాస (వయా పూండి) మార్గంలో 2, శ్రీకాకుళం – పలాస మార్గంలో 1, టెక్కలి – శ్రీకాకుళం(వయా సంతబొమ్మాళి) మార్గంలో 1 బస్సు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ బస్సులు శ్రీకాకుళం 1వ డిపోకి 11, శ్రీకాకుళం 2వ డిపోకి 12, టెక్కలి డిపోకి 6, పలాస డిపోకి 3, మొత్తం కలిపి 32 బస్సులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం apsrtc.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నాటుసారా స్థావరాలపై ఎస్ఈబీ దాడులు



సవరమధ్య సమీపంలో ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం ఊటలు

మందస: గిరిజన ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సోంపేట సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో పిడిమందస పంచాయతీలోని సవరమధ్య ప్రాంతంలో గల నిర్వహించిన ఈ దాడుల్లో నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలు అరికట్టేందుకు కృషి చేస్తున్నామని, నిందితులను గుర్తించి, చర్యలు తీసుకుంటామన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు నాటుసారా తయారీ కేంద్రాలు, అమ్మకాలు, రవాణాపై ఉధృతంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు.

సంస్కృతిని పరిరక్షించుకుందాం

బరంపురం :

గంజాం కళా, సంస్కృతులను పరిరక్షించుకుందామని హోటల్స్ సంఘం అధ్యక్షుడు ఉమాకాంత్ పాణిగ్రాహి అన్నారు. శుక్రవారం రాత్రి కల్లికోట్ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో మహానగర్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష, కళా, సంస్కృతుల పరిరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన జోడిశంఖ నృత్యం, జయగంటల ధ్వని మేళా తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, గోపాల్ పట్నాయక్, సుదీప్ సాహు, నిరో మంకుడో తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల ప్రారంభోత్సవంలో గంజాం హోటల్స్ సంఘం అధ్యక్షుడు ఉమాకంత్ పాణిగ్రాహి తదితరులు



ఆకట్టుకున్న జోడి శంఖ నృత్యం



జయ గంట ధ్వనుల మేళా



హాజరైన సందర్శకులు

మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం



విక్రమదేవ్ విశ్వవిద్యాలయం వద్ద రాజా విక్రమదేవ్ వర్మ కాంస్య విగ్రహావిష్కరణ



పారాబెడ కూడలిలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

జయపురం: మహనీయుల అడుగుజాడల్లో నడుద్దామని వక్తలు పిలుపునిచ్చారు. జయపురంలో మహారాజా రాజశ్రీ విక్రమదేవ్ వర్మ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాంస్య విగ్రహాలను శుక్రవారంజయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆవిష్కరించారు. విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ముఖద్వారం ఎదుట మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రూ.18 లక్షల వ్యయంతో విక్రమదేవ్ వర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ పరేష్ రథ్ రచించిన సాహిత్య సామ్రాట్ విక్రమదేవ్ వర్మ గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దేవీప్రసాద్ మిశ్రా, బీఈడీ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ చీఫ్ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్, జయపురం మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, ఉపాధ్యక్షురాలు బి.సునీత, డాక్టర్ పరేష్ రథ్, ఎంపీ సప్తగిరి ఉల్కా, కమల రథ్, సుధాకర పట్నాయక్, బిజయకుమార్ జెనాదేవ్, దేవ శర్మ, బినోద్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

పారాబెడ కూడలిలో..

జాతీయ రహదారిలో పారాబెడ కూడలి వద్ద ఎమ్మెల్యే ఫండ్ రూ.25 లక్షల వ్యయంతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వందలాది మంది దళిత సమాజ్‌నేతలు, కార్యకర్తలు ర్యాలీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జీవిత చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించారు.

బోటులో నుంచి పడి మత్స్యకారుడు మృతి



మృతి చెందిన కామరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: బోటులో నుంచి పడిపోయి బడివానిపేట గ్రామానికి చెందిన అలుపన కామరాజు(40) మృతి చెందారు. కామరాజుతో పాటు అల్లుపల్లి రాము, చీకటి సత్యారావు, సూరాడ రాము వేటకు వెళ్లగా, సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉండటంతో తీసుకు వెళ్లిన వలలు ఉపయోగపడవని, వలలు మార్పు చేయాలని వెనుదిరిగారు. తిరుగు ప్రయాణంలో బోటు కుదుపులకు కామరాజు కిందకు పడిపోయాడు. దీంతో దెబ్బ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. మిగిలిన మత్స్యకారులు ఆయనను ఒడ్డుకు తీసుకురాగా అప్పటికే మృతి చెందారు. మృతుని భార్య కన్నమ్మ ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సంఘన స్థలానికి చేరుకొని విచారించి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పీఏసీఎస్ డైరెక్టర్‌కు గాయాలు

కొత్తూరు: కొత్తూరు మండలం కుంచాలపేట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పారాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ కుంచాల నూకరాజుకు గాయాలయ్యాయి. నూకరాజు మండలంలోని దాశరథిపురంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి స్కార్పియోలో వస్తుండగా కుంచాల పేట వద్ద అలికాం–బత్తిలి రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో నాగరాజుకు గాయాలయ్యాయి. వెంటనే కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

చీఫ్ వార్డెన్, స్పోర్ట్స్ డీన్ నియామకాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మహిళా వసతి గృహం చీఫ్ వార్డెన్‌గా బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.లోకేశ్వరి, స్పోర్ట్స్ డీన్‌గా డాక్టర్ యు.కావ్య జోత్స్న నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని ఆదేశాలపై శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

హెచ్ఐవీ మహమ్మారిని తరిమికొడదాం

శ్రీకాకుళం న్యూకాలనీ: హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం శ్రీకాకుళం నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలతోపాటు సమీపంలో ఉన్న భారతి ఐటీఐ సంస్థలో ఏపీ శాక్స్ సహకారంతో జిల్లా హెచ్ఐవీ నివారణ, నిర్మూలన సంస్థ సలహా మేరకు చక్రపాణికళా బృందం వారిచే అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ టీబీ, రక్తదాన అవశ్యకతపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్స్ రామారావు, కొత్తకోట రవీంద్ర మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎల్‌డబ్ల్యూఎస్ జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు మాట్లాడుతూ.. విద్యార్థులు హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరూ ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని సూచించారు. కార్యక్రమంలో పాజిటివ్ నెట్‌వర్క్ సిబ్బంది, వైసీబీ పీయూపీ ఎం.శ్రీదేవి, శారద, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రిసోర్స్ పర్సన్ నాగభూషణరావు

క్వార్టర్ ఫైనల్స్‌కు శ్రీకాకుళం సెపెక్‌తక్ర జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర సెపక్‌తక్ర పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రతిభ కనబరుస్తోంది. లీగ్ దశ నుంచి ఓటమి లేకుండా క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. నెల్లూరు వేదికగా ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలురు జట్టు తానాడిన మూడు మ్యాచ్‌ల్లోను ఘన విజయాలు సాధించి సత్తాచాటింది. ఆ సంఘ జిల్లా కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి ప్రోత్సాహంతో మొదటి మ్యాచ్‌లో తూర్పు గోదావరిపై 21–15, 21–10 తేడాతో, తదుపరి మ్యాచ్‌లో పుట్టపర్తిపై 21–11, 21–11 తేడాతో, కీలకమైన నంద్యాలపై 21–09, 21–15 తేడాతో జయకేతనం ఎగురవేసి జిల్లా బాలురు జట్టు హ్యాట్రాక్ విజయాలతో సగర్వంగా క్వార్టర్స్‌కు ప్రవేశించింది. జిల్లా జట్టు రాణింపుపై సెపక్‌తక్ర సంఘ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి సంతోషం వ్యక్తం చేశారు.




బాలురు జట్టు సభ్యులతో కోచ్ అర్జున్‌రెడ్డి

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

కుంచాలకూర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శనివారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో శ్రీ చక్రాలకు, మహా మేరువులకు పూజలు నిర్వహించారు. 1001 శ్రీ చక్రాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్





శ్రీ చక్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

26 నుంచి ఆదిత్యలో జాతీయ స్థాయి గోకార్ట్ చాంపియన్‌షిప్

టెక్కలి: ఈ నెల 26 నుంచి 29 వరకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో 2024–గోకార్ట్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.4 లక్షల వరకు నగదు బహుమతిని అందజేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే కర్నాటక రాష్ట్రం నుండి గ్లోబల్ అకాడమీ ఆఫ్ టెక్నాలజీ, తెలంగాణ రాష్ట్రం నుంచి బీవీఆర్ఐటి, ఆంధ్ర ప్రదేశ్ నుంచి కేఎల్ యూనివర్సిటీ, ఎంజీఆర్, అనిట్స్, గీతమ్, జీఎంఆర్, శ్రీవిష్ణు, కాకినాడ ఆదిత్య, ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి ఒక్కో బృందం పాల్గొన్నట్లు వెల్లడించారు. రఘు, ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి రెండేసి బృందాలతో కలిపి మొత్తం 15 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ గోకార్ట్ పోటీలతో నాలుగు చక్రాల వాహనాల తయారీపై విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ దాడులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై శనివారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించారు. దేశిపాలేం గ్రామంలో చిట్టిరుక అసిరయ్య కోళ్లఫారంలో అప్పయ్య అనే వ్యక్తి మీటర్ బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ సిబ్బంది తనిఖీలను చేసి అసెస్మెంట్, కాంపౌండ్ మొత్తం రూ. 61,140 లను అపరాధ రుసుం కింద విధించారు. అలాగే రేగపాలేం గ్రామంలో కె.పరసయ్య అనే వ్యక్తి కూడా తన కోళ్ల ఫారంలో మీటర్ బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు రూ.70,235 అపరాధ రుసం వేసి కేసు నమోదు చేశారు. అలాగే అదే ప్రాంతంలో విద్యుత్ చౌర్యం చేస్తున్న మరో 26 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులతో పాటు విజిలెన్స్ ఏడీఈ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.


కారులో యువకుని మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని అరసవిల్లి వెలమవీధి పీహెచ్‌సీ పక్కన పార్క్ చేసిన కారులో యువకుని మృతదేహం శనివారం ఉదయం బయటపడింది. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని దమ్మల వీధిలో నివాసముంటున్న మాడుపిట్ల కొర్లయ్య (కిరణ్‌కుమార్, 34) ఫొటోగ్రాఫర్‌గా ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నాడు. ఇతనికి 2012లో బుడుమూరు గ్రామానికి చెందిన నారాయణమ్మతో ప్రేమ వివాహం జరిగింది. ఇద్దరు మగపిల్లలు సంతానం కాగా ఒక కుమారుడు ఏడేళ్ల కిందటే చనిపోయాడు. వృత్తిరీత్యా కొర్లయ్య ప్రతి రోజూ ఉదయం బయటకు వెళ్లిపోయి రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికొచ్చేవాడు. ఒక్కోసారి రాత్రి రాకుండా ఉదయాన్నే వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 23న(శుక్రవారం) ఉదయం ఇంటి నుంచి తన కారులో బయటకు వెళ్లాడు. మధ్యలో తన భార్య నారాయణమ్మ ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. సాయంత్రం అయ్యేసరికి కొర్లయ్య ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఎంత సమయం గడిచినా ఇంటికి రాకపోవడంతో భార్యకు అనుమానం వచ్చి చుట్టుపక్కల గాలించింది. బంధువులకు కూడా విషయం చెప్పింది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో కొర్లయ్య అరసవిల్లి వెలమవీధి పీహెచ్‌సీ వద్ద పార్కింగ్ చేసిన కారులో స్పృహ లేకుండా పడి ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడకు నారాయణమ్మ, బంధువులు చేరుకున్నారు. డ్రైవింగ్ సీట్‌లో కొర్లయ్య చలనం లేకుండా ఉండటం చూసేసరికి ప్రాణం పోయిందని నిర్ధారించుకున్నారు. అప్పటికే అక్కడకు పోలీసులు చేరుకున్నారు. ఈ కారు శుక్రవారం ఉదయం నుంచి ఇక్కడే ఉందని ఓ మహిళ తెలిపారు. తన భర్త మృతిపై తనకు అనుమానాలు ఉన్నాయని నారాయణమ్మ పోలీసులకు చెప్పడంతో వారు కేసు నమోదు చేశారు.



కారులో మృతదేహం, (ఇన్‌సెట్లో) కొర్లయ్య

సంచార సంజీవని



జిల్లాకు కేటాయించిన కొత్త 104 వాహనాలు



పొందూరు మండలం కింతలి పీహెచ్‌సీ పరిధిలో 104 వైద్య సేవలు అందుతున్న దృశ్యం

- 104 వాహనాలతో ఊరికి కొత్త ఊపిరి
- ప్రతి నెల సొంతూరిలో పల్లెవాసికి అందుతున్న వైద్య సేవలు
- రికార్డు స్థాయిలో ఈ ఏడాదిలోనే 25 లక్షల మందికి వైద్యపరీక్షలు

అరసవల్లి: సంచార సంజీవని ఊరికి కొత్త ఊపిరి అందిస్తోంది. గ్రామాల్లో మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులతో పాటు అనారోగ్య బాధితులకు 104 వాహనాల సంచార వైద్య సేవలు (ఎంఎంయూ) వరంలా మారాయి. ఎటూ వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంతూరులోనే మెరుగైన వైద్య సేవలు ఈ సంచార వాహనాల ద్వారా ఉచితంగా అందుతున్నాయి. రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారికి, గర్భిణులకు 104 సేవలు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి. ప్రతినెలా రెండు సార్లు ఠంచన్‌గా ప్రతి గ్రామాన్ని 104 ఎంఎంయూలు సందర్శిస్తూ ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నాయి. గత సర్కార్ హయాంలో మంచం పట్టిన ఈ వ్యవస్థకు జవసత్వాలు కల్పించి ప్రతి మండలానికి 104 వాహనం అందుబాటులో ప్రభుత్వం చర్యలు చేపట్టారు.

నాడు 22.. నేడు 52

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నిర్వహణ బాధ్యతలతో ఈ వాహనాలు నడుస్తున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో 38 మండలాలకు గత ప్రభుత్వం హయాంలో కేవలం 22 వాహనాలే వైద్యం అందించేవి. దీంతో గ్రామాల్లో పూర్తి స్థాయిలో విజిట్స్ జరిగే వీలుండేది కాదు. కానీ ఇప్పుడు విభజిత జిల్లాలో ఉన్న 30 మండలాలకు మొత్తం 52 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌సీల పరిధిలో నెలలో రెండు సార్లు సంచార వాహనాలు విజిట్ చేస్తూ ఉదయం గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నాయి.

ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 104 వైద్య సేవలను పరిశీలిస్తే...

సంవత్సరం	ఓపీ కేసులు	బీపీ	సుగర్	పరీక్షలు
2020–21	4,48,604	71,956	51,608	8,97,208
2021–22	6,52,351	1,59,773	1,34,597	13,14,114
2022–23	7,50,837	3,09,437	2,67,823	15,11,679
2023–24	12,84,264	4,47,504	3,54,660	25,68,528


ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానిస్తూ...

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగానే జిల్లాకు కొత్తగా 25 వాహనాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇవి రాకముందు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో నెలకు ఒక్కో రోజు చొప్పున విజిట్స్ జరిగాయి. కొత్త వాహనాల రాకతో ఇప్పుడు నెలకు రెండు రోజుల పాటు గ్రామాల్లో ఉచిత వైద్య సేవలందుతున్నాయి. వివిధ రోగాలతో, ప్రమాదాలతో ఇళ్లకే పరిమితమైన రోగులకు పీహెచ్‌సీ వైద్యుడు నేరుగా ఇంటికి వెళ్లి వైద్యం అందించేలా ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం డిజైన్ చేసిన సంగతి విదితమే.

104 వైద్య సేవలు ఇలా..

- పీహెచ్‌సీ పరిధిలో గ్రామాల్లో ఉదయం 8.30 గంటలకు సాయంత్రం 4.30 గంటల వరకు 104 వాహనం అందుబాటులో ఉంటుంది. 104 వైద్యుడితో పాటు సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడు, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ అక్కడే అందుబాటులో ఉంటారు.
- మధ్యాహ్నం వరకు గ్రామ సచివాలయాల వద్ద రోగులకు వైద్య సేవలు అందిస్తారు. అనంతరం నడవలేని వారు, మంచాన పడిన వృద్ధులు, దివ్యాంగులు ఇతర రోగులకు ఇళ్ల వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు.
- 104లో ఉండే డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రతి రోగి వివరాలను ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డులో పొందుపరుస్తారు. ఈ వివరాలను టెలీ మెడిసిన్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు అనుసంధానించి భవిష్యత్‌లో తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.
- రోగికి మెరుగైన వైద్య సేవలు అవసరమైతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రులకు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. సంబంధిత రోగిని ఆస్పత్రికి తరలించే బాధ్యతల కూడా స్థానిక ఏఎన్‌ఎం నిర్వర్తిస్తున్నారు.

సేవలు పెరిగాయి



జిల్లాలో 30 మండలాలకు ఇప్పుడు 52 వాహనాలున్నాయి. ఈ ప్రభుత్వంలో గత ఏడాది 25 వాహనాలు కేటాయించారు. దీంతో గతంలో వెళ్లలేని చాలా గ్రామాల్లోకి ఇప్పుడు 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించగలుగుతున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహంతో అరబిందో యాజమాన్య ఆధ్వర్యంలో ఎక్కడా రాజీ పడకుండా ఉచిత వైద్య పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేస్తున్నాం. గత ఏడాది కంటే గణనీయంగా ఓపీ పెరిగింది. 2023–24 ఇప్పటివరకు 12.84 లక్షల వరకు ఓపీ కేసులు రాగా, 25 లక్షల మందికి పైగా పరీక్షలు చేయడం ఒక రికార్డుగా నమోదైంది.

– వినోద్‌కుమార్, 104 విభాగం జిల్లా మేనేజర్.

క్లుప్తంగా

గవరమ్మపేట పరిసరాల్లో గజరాజులు



పంట పొలాల్లో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, ఆసంగి, వెంకటరాజపురం, రామినాయుడువలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు శనివారం సంచరించాయి. అరటి, జొన్న, వరి పంటలు ఉండడంతో దెబ్బతింటున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులు ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తగ్గిన పాసింజర్ రైళ్ల టికెట్ చార్జీలు



చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విన్నేష్

పార్వతీపురం టౌన్: పాసింజర్, డీఎంయూ, ఎంఈఎంయూ రైళ్ల టికెట్ చార్జీలు తగ్గించినట్లు పార్వతీపురం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విన్నేష్ తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం వేకువజాము నుంచి సాధారణ టికెట్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కరోనా విపత్కర సమయం నుంచి పాసింజర్ రైళ్లకు ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూళ్లు చేసేవాళ్లమని తెలిపారు. పాత విధానంలోనే పాసింజర్ రైళ్లకు సాధారణ టికెట్ చార్జీలు వసూలు చేస్తున్నామని తెలిపారు. ప్రయాణికులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో, క్యాబ్‌లపై ఈ చలానాలు రద్దు చేయాలి



కరపత్ర ప్రచారంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: స్టాఫ్ లైన్ వైలేషన్ పేరుతో ఆటో, క్యాబ్‌లపై విధించిన ఈ చలానాలు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా తలపెట్టినట్లు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్‌మోహన్‌రావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద శనివారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.రామారావు, జి.భాస్కరరావు, బి.ప్రసన్న, వై.ఈశ్వరరావు, పి.ఆనంద్, వై.మోహన్, పి.శేఖర్, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మరిన్ని సేవలందించాలి : ఎంపీ



ఈశ్వర్ బ్రెయిన్, స్పైయిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన

విజయనగరం ఫోర్ట్: పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని సేవలు అందించాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక జిడ్డువారి వీధిలో నూతనంగా నిర్మించిన డాక్టర్ ఈశ్వర్ బ్రెయిన్, స్పైయిన్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూరాలజీ వంటి స్పెషాలటీ సేవలు విజయనగరంలో అందుబాటులోకి రావడం రోగులకు శుభపరిణామమని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు, ఆస్పత్రి ఎం.డి తెంటు ఈశ్వరరావు, డాక్టర్ ఆర్ఎస్‌వీ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత్‌రెడ్డి

రాజాం సిటీ: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.అచ్యుతరెడ్డి అన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతను తెలుసుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించిన ఎంతో మంది జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలు క్రీడల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూనివర్సిటీ పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమ్, పీడీ సీహెచ్ కేశవనారాయణ, సీహెచ్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగుల ఆయుష్షు పెంపు

- ఆస్పత్రుల్లో జగనన్న హృదయ స్పందన కార్యక్రమం
- గుండె నొప్పి వచ్చే వారి కోసం ప్రత్యేక చికిత్స
- నొప్పి తీవ్రతను తగ్గించే టీపీఏ ఇంజక్షన్లు ఇస్తున్న వైనం
- గత ఏడాది సెప్టెంబర్ నుంచి జిల్లాలో కార్యక్రమం అమలు
- సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో సేవలు
- గుండె రోగులకు రూ.25 వేలు విలువ చేసే ఇంజక్షను ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వం
- సకాలంలో చికిత్స అందడంతో నిలుస్తున్న ప్రాణాలు



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో రోగికి ఈసీజీ తీస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవన శైలిలో మార్పులు రావడం వల్ల వయసుతో సంబంధం లేకుండా అనేక మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. ఒకేచోట కూర్చొని గంటల తరబడి పని చేయడం, వ్యాయామం చేయకపోవడం, జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ వంటివి ఎక్కువగా తినడం వల్ల ఎక్కువగా గుండె జబ్బులకు గురవుతున్నారు. గతంలో 50, 60 ఏళ్లు పైబడిన వారు గుండె జబ్బులు బారిన పడేవారు. ఇప్పుడు 25 ఏళ్లు, 30 ఏళ్లకే గుండె జబ్బులు బారిన పడుతున్నారు. ముఖ్యంగా గుండెనొప్పి (హార్ట్ ఎటాక్)కు ఎక్కువ మంది గురవుతున్నారు. గుండె నొప్పి వచ్చే సమయంలో సకాలంలో (గోల్డెన్ అవర్)లో చికిత్స అందించగలిగితే ప్రాణాపాయం తప్పుతుంది. ఈ నేపథ్యంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుండె నొప్పి, గుండె జబ్బులు బారిన పడిన వారికి సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో జగనన్న హృదయ స్పందన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దీని వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుంది.

వైద్యులు, సిబ్బందికి శిక్షణ

గుండె సమస్య ఉన్న వారికి ఇచ్చే టీపీఏ ఇంజక్షన్ ఏ విధంగా వేయాలన్న దానిపై వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇచ్చారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో జగనన్న స్పందన హృదయ స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు 14 మందికి టీపీఏ ఇంజక్షన్లు ఇచ్చారు. బొబ్బిలి సీహెచ్‌సీలో ముగ్గురికి, సాలూరు ఆస్పత్రిలో ముగ్గురికి, చీపురుపల్లి ఆస్పత్రిలో ముగ్గురికి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఇద్దరికి, ఎస్.కోట ఆస్పత్రిలో ఒకరికి, గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో ఒకరికి, బాడంగి ఆస్పత్రిలో ఒకరికి టీపీఏ ఇంజక్షన్ ఇచ్చారు. సకాలంలో చికిత్స అందడం వల్ల చాలా మంది పునర్జన్మ పొందగలుగుతున్నారు.

ప్రతి ఆస్పత్రిలో అందుబాటులో వైల్స్

ప్రతి ఆస్పత్రిలోను టీపీఏ వైల్స్ రెండు, మూడింటిని అందుబాటులో ప్రభుత్వం ఉంచింది. ఇప్పటి వరకు 14 మందికి చికిత్స అందించగా ఇంకా 25 వైల్స్ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.25 వేలు కావడంతో దుర్వినియోగం కాకుండా వైద్యాధికారులు సక్రమంగా వినియోగమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

సత్వర వైద్యంతో ఆయుష్షు పెంపు

టీపీఏ ఇంజక్షన్ ఇచ్చేందుకు ప్రతి ఆస్పత్రిలో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఈసీజీ, బెడ్, కంప్యూటర్, సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. గుండె సంబంధిత సమస్యలతో వచ్చే వారికి సత్వర వైద్యం అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చుననే భావనతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. గతంలో గుండె నొప్పి వచ్చే వారికి సకాలంలో వైద్యం అందకపోతే మృత్యువాత పడేవారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బడిగంటి సూరమ్మ. ఈమెది గజపతినగరం మండలం పురిటిపెంట. కొద్ది రోజుల క్రితం గుండె నొప్పి రావడంతో ఈమెను గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఈసీజీ తీసిన తర్వాత గుండె నొప్పిగా నిర్ధారించి టీపీఏ ఇంజక్షన్ చేశారు. గుండె నొప్పి తీవ్రత తగ్గడంతో మరుసటి రోజు విజయనగరంలో ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆమెకు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బి.పార్వతమ్మ. ఈమెది బాడంగి మండలం గూడెపువలస గ్రామం. కొద్ది రోజులు క్రితం గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బొబ్బిలి సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. వెంటనే ఆమెకు ఈసీజీ తీసి గుండె నొప్పిగా గుర్తించి మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో టీపీఏ (టెన్సిటిప్లెజ్)ఇంజక్షన్ చేశారు. దీంతో ఆమె కోలుకుంది.

26న రోడ్ ఓవర్ బ్రిడ్జెస్, ఆర్‌ఓబీలకు శంకుస్థాపన

విజయనగరం టౌన్: అమృత్‌భారత్‌లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, రోడ్ ఓవర్ బ్రిడ్జెస్, ఆర్‌యూబీల నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 26న ఉదయం 10.45 గంటలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలోని పార్వతీపురం (రూ.14.76 కోట్లు), బొబ్బిలి (రూ.16కోట్లు), కొత్తవలస (రూ.18.77 కోట్లు), చీపురుపల్లి (రూ. 21 కోట్లు), శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌లో రూ.23 కోట్లతో చేపట్టనున్న ఆధునికీకరణ పనులను ప్రధాని ప్రారంభిస్తారన్నారు. విజయనగరంలోని వీటీ అగ్రహారం సమీపంలోని మ్యాంగో యార్డ్ ప్రాంతం, చీపురుపల్లి, దూసి వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

ఏప్రిల్ 1న పాలకొండలో జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: పాలకొండ సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 1న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమా, బీఎస్సీ, ఎంబీఏ అర్హత గల 18 నుంచి 30 ఏళ్ల యువత అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్‌తిమ్మన, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అరబిందో, ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్, హెటిరో డ్రగ్స్, మేధాసర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, నవతా, బిఫిల్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు . ఆసక్తి గల యువతీ యువకులు తమ వివరాలను స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని రిఫరెన్స్ నంబరుతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత సంబంధించిన పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల శంకుస్థాపనకు ఆహ్వానం

పార్వతీపురం: స్థానిక రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 26న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికను శనివారం కలెక్టర్ చాంబర్‌లో సీసీఐ ఎం.రవికిరణ్ అందజేశారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 554 స్టేషన్లు, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాసేజ్‌లను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని 22 స్టేషన్ల ఆధునికీకరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో వాల్తేరు డివిజన్ పరిధిలోని పార్వతీపురం, సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపడ, పర్లాకిమిడి, బొబ్బిలి, రాయగడ, కోరాపుట్, అరకు, జైపూర్ రైల్వే స్టేషన్లు ఉన్నాయి. వీటిని రూ.500 కోట్లుతో ఆధునీకరించనున్నారు. రూ.170 కోట్లు అంచనా వ్యయంతో నాలుగు రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనుల కోసం కూడా శంకుస్థాపన చేయనున్నట్టు సీసీఐ తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది ఎ.సతీష్, పి.త్రివిక్రమ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సీసీఐ రవికిరణ్, తదితరులు

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకరరావు, వెనుక ముసుగులో నిందితుడు లక్ష్మణరావు

బొండపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకోని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు గజపతినగరం సీఐ ఎన్.వి.ప్రభాకరరావు విలేకరుల సమావేశంలో శనివారం వెల్లడించారు. హత్యకు దారి తీసిన కారణాలను వివరించారు. నిందితుడు డోల లక్ష్మణ రావుకు తండి రాము, సవతి తల్లి జయలక్ష్మికి మధ్య గడిచిన ఎనిమిదేళ్లగా కుటుంబ తగాదాలు ఉండడమే హత్యకు దారి తీసినట్టు తెలిపారు. ఈ క్రమంలో నిందితుడు లక్ష్మణరావు శుక్రవారం ఉదయం దుస్తులు ఉతుకుతుండగా మురుగు నీరు తమ ఇంటి వైపు ఎందుకు వచ్చిందని సవతి తల్లి జయలక్ష్మి లక్ష్మణరావుతో తగాదా పడింది. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన లక్ష్మణరావు కత్తితో ఉదయం 11 గంటల సమయంలో సవతి తల్లి జయలక్ష్మి, తండ్రి రాముపై దాడి చేసి విచక్షణ రహితంగా నరికి వేయ డంతో అక్కడికక్కడే మృతి చెందినట్టుప్రాథమిక విచారణలో వెల్లడైనట్టు తెలిపారు. వీఆర్ఓ బి.రవి కాలనీలో హత్యలు జరిగినట్టుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడే ఉన్న నిందితుడు లక్ష్మణరావును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. సమగ్ర విచారణ చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. నిందితుడు హత్యలకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సీఐ వెంట ఎస్ఐ కె.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రతీర్థ స్నానం



రామకోనేరు వద్ద స్వామివారికి చక్రతీర్థ స్నానం చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ప్రాతః కాలార్చన అనంతరం యాగశాలలో పూర్ణాహుతి జరిపించారు. అనంతరం స్వామివారి సుదర్శన పెరుమాళ్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి రామకోనేరులో ఆశీనులు చేశారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు చక్రతీర్థస్నానం చేశారు. రాత్రి 7గంటలకు ధ్వజాఅవరోహణ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. స్వామివారి తిరుక్కల్యాణం, రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా సమస్త దేవతామూర్తులను ఆహ్వానిస్తూ మొదటిరోజు ఆలయ ధ్వజస్తంభం పై ఎగురవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా కిందకు దింపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి కొట్నం, వినోదోత్సవం, అవబృదం తదితర కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. స్వామివారికి ఆదివారం పుష్పార్చన చేపట్టి తిరుక్కల్యాణ మహోత్సవానికి ముగింపు పలకనున్నట్టు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహించడం నేరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

చీపురుపల్లి: బాల్యవివాహాలను ప్రోత్సహించడం నేరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాల్యవివాహాలు నిరోధక చట్టంపై రెవెన్యూ డివిజన్ స్థాయిలోని అన్ని మండలాల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలకు సిద్ధమైన తల్లిదండ్రులపై ముందుగా కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే బాల్యవివాహాలకు అడ్డుకట్టవేయవచ్చన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చదువుకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు బోధించాలన్నారు. సదస్సుకు హాజరుకాని అధికారులకు మెమోలు ఇవ్వాలని ఆర్డీఓకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు శీతారాం, ఆర్డీఓ బి.శాంతి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, నోడల్ అధికారి విజయకుమారి, చీపురుపల్లి, రాజాం, గరివిడి ఐసీడీఎస్ పీఓలు కేవీఎస్ రాజేశ్వరి, ఆరుద్ర, కనకదుర్గ, ఎస్‌జీఓ జిల్లా కో-ఆర్డినేటర్ జి.ఝాన్సీరాణి, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, వెలుగు ఏపీఎమ్‌లు పాల్గొన్నారు.

సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన బాలికలు



రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్న జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన సబ్ జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికల జట్టు సత్తా చాటింది. ఈ నెల 22, 23 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ఫైనల్స్‌కు అర్హత సాధించి 32-34 పాయింట్ల తేడాతో ఓటమి చెంది ద్వితీయ స్థానంలో నిలిచింది. టోర్నీలో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచిన మజ్జి పావని వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి రాంబాబు చేతుల మీదుగా రూ.3వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందుకుంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం దక్కించుకున్న బాలికల జట్టును జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కెవి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు అభినందించారు.

జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణానికి నేడు శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి విజయనగరం: జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరగనుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా కోర్టు భవనాల నిర్మాణానికి భూమి పూజ జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటీ అగ్రహారం వద్ద జిల్లా కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి సంకల్పించారు. ఈ నేపథ్యంలో పాత భవనాలను తొలగించారు. రూ.99.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ కాంప్లెక్సులో 19 కోర్టులతో పాటు కాన్ఫరెన్స్ హాల్స్, న్యాయవాదుల సంఘ భవనంతో పాటు వీఆర్ సిస్టంను ఏర్పాటు చేయనున్నారు. 6.58 ఎకరాల స్థలంలో నిర్మితం కానున్న ఈ కాంప్లెక్సును ఆధునిక వసతులతో రూపుదిద్దుకోనుంది. ఏసీ కోర్టు హాల్స్‌తో పాటు కక్షిదారులకు లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు కానుంది. శనివారం ఉదయం జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ్ చక్రవర్తి శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. భూమి పూజ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్, న్యాయవాద సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొంటారు.



భూమి పూజకు సిద్ధమైన స్థలం

పోగొట్టుకున్న మొబైల్స్ బాధితులకు అందజేత

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 15 మొబైల్స్‌ను వారం రోజుల్లోనే ట్రేస్ చేసి, ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో సోషల్ మీడియా సైబర్ సెల్ సీఐ టివి.విజయకుమార్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ వద్ద బాధితులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ సెల్ పోలీసులకు మొబైల్ ఫోన్‌లను పోయినట్లుగా ఇచ్చిన ఫిర్యాదులు ఆధారంగా మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు సైబర్ సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాలలో పోగొట్టుకున్న మొబైల్స్ ఫోన్‌లను గురించి ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే 15 మొబైల్ ఫోన్‌లను ట్రేస్ చేశామన్నారు. వాటిని బాధితులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రశాంత్ కుమార్, నజీమా బేగం, సైబర్ సెల్ కానిస్టేబుళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీషా ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




పోగొట్టుకున్న మొబైల్‌ను బాధితులకు అందజేస్తున్న సీఐ విజయకుమార్

న్యాయ సేవలకు మరింత ఆసరా

- బొబ్బిలిలో రూ.31.20 కోట్లతో కోర్టు భవన సముదాయం నిర్మాణం
- పనులకు శంకుస్థాపన చేసినక సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహ, హైకోర్టు చీఫ్ జస్టిస్ ఠాకూర్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీం, హైకోర్ట్ న్యాయమూర్తులు



కోర్టు నమూనా

బొబ్బిలి:

న్యాయ సేవలకు మరింత ఆసరాగా కొత్త భవన సముదాయాలు నిర్మిస్తుండడం ఆనందంగా ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి పమిడి ఘంటం నర్సింహ అన్నారు. బొబ్బిలిలో రూ.31.20కోట్ల వ్యయంతో తలపెట్టిన కోర్టు భవనాల సముదాయానికి శనివారం మధ్యాహ్నం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రైవేటు రెసిడెన్సీలో న్యాయవాదులతో ఏర్పాటుచేసిన సమావేశంలో నర్సింహ మాట్లాడారు. న్యాయవాదులు స్వతంత్రత కలిగి ఉండాలన్నారు. అధికారానికి అనుకూలంగా ప్రతికూలంగా ఉండడం వల్ల న్యాయవాదులు బలహీనమవుతున్నారని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ మౌలిక స్వరూపంలో జిల్లా కోర్టులు ఓ భాగమన్నారు. జిల్లా కోర్టులను బలోపేతం చేసేందుకు అందరం దృష్టి సారించాలని, కోర్టుల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై ప్రజలు పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. భవనం త్వరిత గతిన పూర్తయి మరిన్నిసేవలు అందాలని ఆకాంక్షించారు. కోర్టు భవనాలంటే కట్టడాలు కాదని, ధర్మాన్ని రక్షించే ప్రతిరూపాలుగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విజయనగరం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం, కురుపాం ప్రాంతాలన్నీ రాజవంశీయుల పాలనలో ఉండేవని, ఈ ప్రాంతాల్లో ఎక్కువగా భూ వివాదాలకు సంబంధించిన కేసులే ఎక్కువగా వస్తున్నాయన్నారు. అనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులతో కలిసి వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించారు. అంతకుముందు సమావేశంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి దంపతులు, హైకోర్టు న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులను స్థానిక న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ చక్రవర్తి, అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్, జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ బి. సహాదిత్ వెంకట్ త్రివినాగ్, ఎస్పీ దీపికా పాటిల్, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు నాగేశ్వరరావు, తిరుమలరావు, ఇన్‌చార్జి ఆర్డీఓ సందీప్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంటి గోపాలకృష్ణశర్మ, తమ్మిరెడ్డి ధామోదరరావు, ఏపీపీ మజ్జి జగన్నాథం, తహసీల్దార్ ఎస్. కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.